# బోధి వృక్షం

—'అపర్ణ'

"నూటొక్క క్షమాపణలు!"

చురుకు సన్నబారిన సూరీడు పగటి నిలికైన నవంబర్ నెల చివరి రోజు మధ్యాహ్నం. అకౌంటెంట్ టేబిలు మీంచి ఎత్తుకున్న ఫోనులో వేచి ఉన్న పలకరింపు శంకరానిదిగా పోల్చుకున్నాడు సారథి.

"సాయంత్రం తీరిక అవుతుందా?"

సారథి జవాబుతో ప్రమేయం లేకుండానే ప్రస్తావనలో దిగాడు శంకరం.

"ఏప్రిల్ ఒకటో తేది ఏడాది కొక్క సారే ననుకుంటాను!"

ఆ వూరు బదిలీ అయి వచ్చిన ఆరు నెలలుగా మార్పులేని ముగింపు చూడని పరామర్శ అది.

"నీ కో బహుమతి ఇవ్వాలని మనసు!"

"సొరకాయలు చవకగా ఉన్నట్లు నగర వాణి!"

"పరమ సత్యాన్ని పరిహాసంగా పరిమారుస్తున్నావు, బొత్తిగా దయమాలి."

"నీ దయే పాపం కొల్లబోవడం?"

"అన్వేషణలో జాగు తప్పనిసరి."

"అరిగి పోయిన గ్రామఫోన్ రికార్డు."

"ఓపిక పట్టాలి, నేస్తం!"

"నా గది గోడమీద రాణిస్తున్న సూక్తి ముక్తావళి!"

"అలవి కానివేళ చెవిటి తనం మేలని సుభాషితం!"

"అఘోరించు!"

"థాంక్సుకి అతికిపోయే తెలుగు దొరక్క పోవడం ఎంత మందభాగ్యం!"

"ప్చ్! ప్చ్! ప్చ్!"

"ఘన, ద్రవ, వాయు పదార్థాలకు పూచీపడి మరీ బయలు దేరి రావాలి!"

ముక్తాయింపు సెలవయి ఫోన్ దించేశాడు సారథి.

* * * *

"యామిని!"

ఆనవం మర్యాదకు సైగలు వెళ్ళు మార్చి లాంఛనపూర్వకపు వాడుక వాక్యాల్ని దొర్లించి, సంజెనీడలు పారాడుతూండగా, ఆ సాయంకాలపు విశేషానికి పేరిచ్చి చేతులు విదుపుకున్నాడు శంకరం.

లేపాక్షి పునరుత్పన్నాలు ముద్రితమైన ఆరుద్ర పురుగు రంగు పమిట కింద నుంచి నాజూకుగా ఎదురు బొదురైన అరిచేతుల గుండా అనుసరించి వచ్చింది పరిచయం, గాజుల సవ్వడి నేపథ్యంగా.

"పొరపడకపోతే టెలిఫోన్స్‌లో కదా పని చేయడం?"

ప్రతి మర్యాద చెల్లిస్తూ కూర్చున్న కుర్చీ చేతుల నడుమ పూర్తిగా అనువయింపబడకుండానే అధర స్పందనం చేశాడు సారథి.

అర్థం కానట్లు చూశాడు శంకరం, ఆ అవ్యవధానపు ఆలాపనకు.

"ఈ టెలిఫోన్ ఆపరేటర్ పరిచితుల్లో..." విడబారిన కాటుకలేని రెప్పల ఆచుల్ని ఒరుసుకుని ఉబికించిన కనుపాపలో తూలిన ఆశ్చర్యం—"నొచ్చుకోకూడదు. మీ సంతకం లేదంటే!" పెదిమల పాకి స్వల్పంగా చాతుర్యం బోడించుకుంది.

"ఆరబోసిన కన్నుల్లో వెదుకాడు కను లెవరివో మురళి మీద ఆన సురపొన్నమీద ఆన నామీరా నామీరా—

ఈ సాక్ష్యం కొట్టి వేయ రనుకుంటాను."

"ఆ యథార్థంతో మీ బాంధవ్యం..."

పెదిమల తెగిన సందేహం రెప్పపడని కళ్ళను ఎక్కుపెట్టింది.

"ఉంది. సొంతమైనదాన్ని సొంతం అని సంజాయిషీ ఇవ్వవలసిరావడంలో ఉన్న నామోషీకి సానుభూతి చూపించవలసి ఉంది!"

కుదురు లేని చూపులతో కుర్చీలో అసౌకర్యంగా మసిలాడు.

"ఆ పాట... ఆ లైబ్రరీ బుక్..."

నేటికో నేటికో గొలుసులు తగిలిస్తూ నెమరు వేసుకొంటున్న వాలకం పోతూ అస్పష్టంగా ధ్వనించింది.

"పేజీల మధ్య పరాకుగా ఉంచిన కాగితం ... మరిచి లైబ్రరీలో వాపసివ్వడం ... యాదృచ్ఛికంగా మీరు తీసుకోవడం ... మీ గొంతు మీ ఆఫీస్‌లో ఫంక్షన్ రోజు వీథిని వెడుతున్న నాకు పట్టివ్వడం ... మీకోసం ప్రయత్నించడం ... విఫల యత్నం ... అణగారని కుతూహలం ... వాకబు మానేసిన విరామం ... ఈ సాయంత్రం ఇలా స్నేహితుడి చలవ— వెరసి ..."

"గీతం మీది! సంగీతం నాది!"

పెదిమలను, కండ్లను మందహాసా స్నద్దుతూ తేల్చింది యామిని.

"అనుమతిస్తే సంభ్రమ సంజనిత ఉదంత సంతోషం ఏడిది!"

కొస మెరుపు వెలిగించాడు శంకరం, శ్రోత పాత్ర విరమించి.

బలవంతం లేక, బిడియం లేక పెదిమల మధ్య పత్తికాయలు చిట్లాయి.

"ఇదే కథగా ప్రస్తావిస్తే కల్పన అంటుంది సమీక్షా ప్రపంచం."

టీ తాగడం ముగిస్తూ అన్నాడు సారథి.


"ఒప్పించే తీరువలో పొంచి ఉంటుంది కథా రహస్యం!"

అప్పుడే మొలక ఎత్తి బీజ దళాల మధ్య ఒత్తిగిలుతూ తొంగి చూసే మడత విడని పత్రమైనాడు సారథి.

ఆ తరవాత ఒక విషయం మీంచి మరొక విషయానికి మెదడు తెగిన దేహాల మధ్య సంభాషణ వంటి సంభాషణ. మధ్య మధ్య త్వరగా భంగపడని మౌనం. మొగమాటపు కదిలికలు. నిర్వ్యాపకపు పరికింపులు.

"మళ్ళీ కలవడం ..."

"నా కిష్టం!"



ప్రయాణికులు వేచి ఉండే గది వాతావరణాన్ని భంగపరుస్తూ సెలవు చెప్పను ఉద్యుక్తుడై లేచిన సారథికి యామిని అందించిన తోడ్పాటది.

* * *

సాయంకాలపు ఛాయలా పరిచయాన్ని సాకించ వచ్చన్న విశ్వాసం కలిగిన మూడు నెలల తరవాత—

తూరుపు ఒడిలో శిరసోదయం చేసి నడిమింటి దర్బారున మిడిసిపడి, పడమటి కొసలో భానుడు కాషాయపు జెండా ఎగరేస్తున్న వేళ.

"బొత్తిగా నల్ల పూస అయిపోయారే!"

ప్రభుత్వపు మహిళా కళాశాల ముందు, ఆటో దిగి, తల తిప్పి చూసిన యామిని తన పక్కగా పడిన నీడను సారథిగా పోల్చుకుంది.

"మరొకచోట కొలికి పూస అయిపోయి!"

మెయిన్ గేట్‌లోకి దారి తీస్తూ అంది యామిని.

"బిథోవెన్ జంత్రవాద్యాడంబరం ఉంటుంది మీ మాటల్లో!"

నవ్వు వచ్చింది. ఆపుకుంది. సగం జారే పోయింది.

"మోనాలీసా పెదిమల మీదే చూచిన గుర్తు!"

"ఇప్పటికే సన్నబడిపోతున్నానని నేనుంటే గునుపు మీ పొగడ్తలతో ద్వారాలు వెడల్పు ..."

పూర్తి కాకుండానే ఆపిన మిగతా సగం నవ్వు తోసుకువచ్చేసింది.

చిత్రకళా ప్రదర్శన విభాగపు హాలులో చేరుకున్నప్పుడు —

తెలుపు, నలుపు చిత్రాలు. తైలవర్ణపు పటాలు. ఛాయా చిత్రాలు. ప్రసిద్ధుల చిత్రాల పునరుత్పన్నాలు. చిత్రకళకు సంబంధించిన పుస్తకాలు. కీర్తిశేషుల చిత్తరువులు, చరిత్ర.

"కెమిరాకు, కుంచెకు తేడా చెప్పండి."

నందలాల్ బోస్ 'సంధ్యా ప్రదీప్' పునరుత్పన్నం మీదికి దృష్టి పోనిస్తూ అడిగాడు సారథి, యామినిని.

"చిత్రకారుడికి వస్తువు అజ్ఞాత భావన. ఛాయా గ్రాహకుడికి అది ప్రత్యక్షం."

"సృజనగా ఛాయాగ్రహణాన్ని అలంకారపు పూత లేని సహజ సృష్టిగా భావించ వచ్చు."

"అలా అని సాహిత్యంలో కళలో అలంకారం యథార్థాన్ని మభ్యపెడుతుందంటే అంగీకరించలేను."

"మరి, అలంకార వినియోగం ఏమనుకోవాలి?"

దృష్టి ఉంచిన పి.వి. పతి 'మాన్‌సూన్' స్థిరచిత్రం మీంచి మరలుతూ, "వస్తువును సుందరంగా రూపించే ఒక సాధనం" అంది యామిని.

"వాస్తవమైన ఉనికి నుంచి దూరం చేస్తున్నట్లే గదా?"

"యథాతథం — అంటే ఫోటోగ్రాఫ్ పద్ధతి కళాదృష్టి కాదు."

"ఏది కళా దృక్పథం?"

"ఒక విషయాన్ని దర్శించడానికి, దాని స్వరూపాన్ని పోల్చుకోవడానికి తేడా ఉంది. ఆ రెంటినీ వేరు చేసి మూడవ స్థాయిలో చూడడమే కళా దృష్టి."

"రసవాదులు!"

"నిజమే. కళ తొలగించి జీవిత మంటే నా కానక్తి లేదు."

సారథి మాట్లాడలేదు. గ్రీవాభిరామంగా యామినిని గమనిస్తూ ఉండిపోయాడు.

"ఆ బుద్ధుడి బొగ్గు చిత్రం చూశారా?"

"నల్లగీతల్లోకి నిపుణంగా తర్జుమా అయింది కదూ?!"

"పోలిక పట్టుకు రావడం ప్రతిభ అనలేను. ఎన్నుకున్న మూర్తిత్వానికి సంబంధించిన స్వభావం చారిత్రక ప్రభావం పట్ల సల్పార్చిన శోధన సాధనలు మథించిన తత్త్వచింతనా తేజం పటం కట్టించడం ప్రజ్ఞగా భావిస్తాను."

చీకటి గుహలో దివిటీ వేసినట్లు యామిని కేసి సారథి కండ్లను ఒక చేతనతో కూడిన మెరుపు.

"మహాజ్ఞానం సిద్ధించి అలౌకిక కరుణార్ద్రతతో అనంత విశ్వాన్ని చిన్మయంగా అవలోకిస్తున్న ఒక శాంత నిర్మల వర్చస్సు ఆ ఫాలభాగంలో, నేత్రాలలో, పెదిమలలో ప్రస్ఫుటం కావలసి ఉంది."

ఒక్క క్షణం ఆగి సారథి కేసి సాలోచనగా రెప్పలార్చుతూ చూస్తూ లోగొంతుకన పలికింది: "తెలియక ఆనందించడంలోని హాయికి కొని తెచ్చుకునే నష్టం తెలుసుకుని ఆనందించాలనే యావ!"

"బొమ్మలు గీస్తారా?"

"చూస్తాను!"

అహంకారమా? అతిశయమా? అల్పత్వమా? అవహేళనా? — బోధపడలేదు సారథికి.

"ఇంత పరిజ్ఞానం ..."


"తెలుసు అనిపించుకోవడానికి సేకరించి గడించినవి."

ఎంత ఠీవి ఆ కనుబొమలకు!

"జిజ్ఞాసువులు!"

"పెద్ద మాట!"

లలితంగా నవ్వి అంది యామిని.



కదులుతూ చూస్తూనే, రేఖల వక్రీకరణ మీద, వర్ణ సంవేశనమీద, పారదర్శకత మీద, స్పర్శనీయత మీద మాట్లాడుతూండి పోయింది, సారథి కుతూహలం కేంద్ర బిందువుగా.

వెలుగు పరాజిత అయి, నాలుగు చెరగులా లేత చీకటుల ఆక్రమణకు సన్నాహమవుతూండగా వెలుగుతూ ఆరుతూ ఉన్న విద్యుద్దీపాల తోరణాల క్రిందుగా ఆవరణలో పచ్చికను తాత్సారపు అడుగులు వేస్తూ నడుస్తూ ఉన్నప్పుడు — "శంకరాభరణం చూశారా?" అన్నాడు సారథి యాథాలాపంగా.

"బాగుంది."

"ముక్తసరిగా ఉంది!"

"విమర్శ వదులుకోలేను కనక అంతకే."

"ఏమిటి లోపించడం?"

"శంకరశాస్త్రి ఉనికి."

కళ్ళు చిట్లించాడు సారథి.

"మామా అల్లుళ్ళ గాత్రం ఒకేలా ఉండటం దర్శకుని అభిరుచికి నిదర్శనమా? రక్తసిక్తమైన చేతులతో వచ్చిన తులసిని చూసి కించిత్తు కూడా



వెరుగుపడడు శంకరశాస్త్రి. అది అతడి గంభీరతను చాటను వాడుకోదగిన దృశ్యమా? కూతురు పాడే కృతిలో స్వర సంకరాన్ని ఆగ్రహించిన రాగ ధురంధరుడు అల్లుడి అపశ్రుతుల శ్యామలా దండకానికి పులకించడం ఔచిత్యమా? తెలుగు చిత్ర మన్నారు— పాటలు దీర్ఘ సమాస సంస్కృత పద భూయిష్ఠం, మరి!"

"ఇంత నిశితంగా ..."

"ఈ దశాబ్దపు కళా సృష్టిగా అభివర్ణిస్తున్నారు కనక!"

"మరి, ప్రజానీకం ..."

"నేనయినా స్థూలంగా దర్శకుడి పిపాసను, చిత్తశుద్ధిని శంకించడం లేదు."

"మీ పలుకులకు జేజేలు పెట్టాలి!"

గడుసుగా అన్నాడు సారథి.

"నా కృతజ్ఞతల మీద చాలా మోజున్నట్లుంది మీకు ... కంచి గరుడసేవ!"

నిక్కచ్చిగా నవ్వింది, సారథి కళ్ళలోకి చూస్తూ, రెప్పలు విదుపుతూ.

'యామిని వంటి ఆడపిల్లతో స్నేహం నిజంగా...' మిత్రుడు శంకరానికి ధన్యవాదాలు వెళ్ళిపోయాయి సారథి మనసులోంచి.

* * * *

"శుభోదయం!"

"ఇది మధ్యాహ్నం కదా?"

"ఐరోపావారు ఆదర్శం చేసిన ప్రాథమిక మర్యాదకు ముక్కుసూటి అర్థం కూడదు!"

"ఏమిటి విశేషాలు?"

"వృత్తి దారిలో తారసిల్లిన సుదూరపు సరసురాలితో సరదా కబురు వెలిగించి అధికారుల నుంచి అందుకున్న సంజాయిషీ పత్రం — రాని దుఃఖాన్ని నటించి ఒక చావు సమావేశంలో ఇరుక్కుని రాణించిన మైనం — వినోదం కొల్లబోయి చూడబోతే నిదుర కాజేసిన దిక్కుమాలిన త్రికోణ ప్రణయపు భంగపాట్ల దేశవాళీ సినిమా — జనం తెరిపి లేకుండా తిరిగే బజారులో చెప్పు ఉంగరం తెగి నామోషీ అయి అక్కడే తెగించి త్యాగం చేయలేక ఈడుపు నడకతో కొంపచేరిన నాగరికపు అగచాటు — పాడికళ్ళు నడేదాకా సాహిత్య శరణాలయంలో జాగారం చేసిన పొద్దులు ..."

"పెద్ద నైమిశారణ్యం! వూం కొరవ ఏమయినా?"

"న శేషమ్ జీవితమ్! అంటే, నా వ్యుత్పత్తి జీవితం ఉన్నంతవరకూ విశేషాలు సశేషా లేవని!"

* * * *

"మీ నాన్నగారు కమ్యూనిస్టనుకుంటాను."

"నా కంతగా తెలియదు."

ఎవ రీ యామిని? ఏమి టీ ఉద్వృతం?

"కమ్యూనిజం మీద మీకు అభిప్రాయం లేనట్లుంది."

"కమ్యూనిస్టుల మీద అని సవరిస్తే నాకు న్యాయం చేసిన వా రవుతారు."

"ఆ గళ్ళ ముడికట్టు మీరే విడదీస్తారా?"

"కుటుంబం చాలా చితికిపోయిన రోజుల్లో మా నాన్న సమాజాన్ని అదే పనిగా ఆడిపోసుకున్న విప్లవ వాది. ఆయనకు రాని వివాదాలు లేవు. అప్పట్లో పొరబాటున దూకుడుగా వ్రాసిన ధారావాహికమైన వ్రాతలు ఆయనకు కమ్యూనిస్టు ముద్ర నిప్పించాయి. కాలక్రమంతో కాస్త నిలదొక్కుకున్నాక ఆ బిరుదు ఆయనను అంతర్గతంగా దిగులు పెట్టింది. కలిసి వచ్చిన శాంతి సుఖాలకు ఇబ్బందిగా తోచసాగింది. అయినా, కమ్యూనిస్టుల విశ్వాసం ఆయన్ను వదల లేదు ఈవరకూ!"

"దారుణంగా ఉంది మీ అభివర్ణన."

"యథార్థం కదా?"

"అదలా ఉంచండి. సిద్ధాంతపరంగా..."

"క్షమించాలి! జీవితంలో, సాహిత్యంలో, కళలో కమిట్‌మెంట్ చెరసాల నేను భరించలేను, వరించ లేను!"

* * *

"ఎవరూ మాట్లాడ్డం?"

"అనగనగా యామిని అనే ఆడ పిల్ల!"

యామిని ఆడపిల్లా?! ఊహుఁ- భావ్యం కాదు ఆ అపచారం. ఇంక తన వల్ల కాదు. 'ఆమె' గా ఉదహరించడం సముచితం! న్యాయం!

"ఏం డ్యూటీ చేస్తున్నారు?"

"ఏ దేశ మేగినా ఎందు కాలిడినా మా టెలిఫోన్ ఆపరేటర్ల కిదో గత్యంతరం లేని శుద్ధ వ్యర్థ పరామర్శ!"

"చెప్పారు కారు!"

"గది కోసం వెదుకుతున్నారట కదా?"

"మీ రేమైనా సాయపడతారా?"

"మూడు నెలలు ఆగగలిగితే మా వరాండా ముందు గదికి మీ ముచ్చట ఉంచవచ్చుని!"

"బ్రహ్మానందమే కానీ..."

"సంశయాత్మా వినశ్యతి!"

"బ్రహ్మచారుల కివ్వడం..."

"అది మా నాన్నగారి విచారణా విభాగం!"

"మరి, మీ సిఫారసు..."

"వినిపిస్తున్నది ఆ హిట్ సాంగే కదా, మహాశయా?!"

* *

'పున్నమి మల్లిన — మూడున్నొక్క పొద్దున— తొలి జాబున తళు కేసిన కెంపు చుక్క — రిమరిమే సున్నల్లో కెక్కి శూన్యంలోకి పాకి—కానరానంత మేర కమ్ముకుని ఉన్న మొయిలు తుంపరలో, వక మినుకు వల్లమాలిన వెలుగై పోవంగా—రవ రవ మంచులు చిమ్మి ... కోనలో నాయకుడికి ... వక గుక్క కుశేలొచ్చి—గురివింద పొద మీద పులుగు పోరెట్టగా—'

మెడ తిప్పి చూసింది యామిని, రామకృష్ణ శాస్త్రి 'దోదమ్మ' లో తర్జని ఉంచి మూస్తూ.

సకిలింపు లాటిది చేసిన సారథి అభివాదం చేస్తూ దగ్గరగా అడుగులు వేశాడు.

"బాగున్నారా?"

"మనలో చెడిపోయే భాగ మేమి టంటారు?!"

దూదికుప్పల నడుమ వెలుగు రవ్వ రగిలినట్లు యామిని ముక్కు పుడక మెరిసింది, పెదిమల కదలికలో.

శ్రీటెక్స్
ఫ్యాబ్రిక్స్
ఇంటింటి
అవసరాలకు...
ఇంటిల్లపాది
ఆనందానికి...
శ్రీటెక్స్
దుప్పట్లు
శ్రీటెక్స్
తువ్వాళ్ళు
శ్రీటెక్స్
ఫర్నిషింగ్స్
అందానికి...
ఆకర్షణకి...
మన్నికకు...నమ్మికకు
మేలైన రంగులకు
వాడండి!
Sreetex SALEM ®
ఉత్పత్తిదారులు:
ఓ.జి. టెక్స్‌టైల్స్
(ప్రై) లిమిటెడ్.
సేలం-636006

"పొదుపు తక్కువ!"

"దేనికి?"

"మీ మాటలకు!"

"వాక్ స్థానంలో బృహస్పతి ఉన్నాడన్న పెద్దల దీవెనవి పంతులమ్మగా పుహాలో శాసించుకుంటే, గ్రామ బెల్ చదువ ఆర్థాంతరంగా కాజేసింది."

యామినిలో ఏమిటి ఆకర్షణ?—

తెలివిగా కదలాడే రేగడి రంగు కనుపాపలా? తన మాటల్ని పాట చేసిన వైనమా? ఇంకా పెండ్లి కాలేదనా? గొంతులో స్వల్పంగా ధ్వనించే మగజీరకా? మాటకారి తనమా?

అసలు ఏటిలో ఉందా జవాబు?

ఒకటే మాత్రం నిజం. ప్రపంచంలో అరుదుగా తారసపడే స్త్రీ యామిని! తోచ! తల బాదుకునే వాళ్ళకు వరంగా దొరకవలసిన కాలక్షేపం!

"పరాకులో పడ్డట్లున్నారు!"

కొద్దిగా ఉలికిపాటు పభినయించి తేరుకుంటూ—"చదవడానికి అక్కర లేకపోయిన పరికొత్త ఆభరణం . . ." అంటూ ముక్కు మీదికి జారిన యామిని వెడల్పాటి కళ్ళద్దాల్లోకి చూస్తూ కుతూహలంగా మిగిలి పోయాడు సారథి.

"అద్దం బలపరిచిన సౌందర్య సాధనం!"

చుట్టూ వాతావరణాన్ని విరోధించి యామిని మొగం లోకి రెప్ప వాల్చక చూశాడు ఒక మారు, సారథి.

"ఎక్కడో విన్న జ్ఞాపకం."

క్షణాలు తాళి తనకు, యామినికి నడుమ పుస్తకాల అరల పైకి వాల్చిన విచ్చిన మెట్ల ఖాళీలో చేతులు జారేస్తూ మొదలు పెట్టాడు సారథి.

గాజుల చేతు లేలుతున్న తెలుగు అరలు దాటి హెరాల్డ్ రాబిన్‌సన్ 'నెవర్ లవ్ స్ట్రేంజర్' ఇంగ్లీషు దొంతుల్లోంచి లాగబోయి, సారథి వంక ఆలకింపుగా చూసింది యామిని.

"మగవాడు చేసే కవనాల్లో నాయికతో ప్రేమలో పడతాడట రచయిత. ఆ వల్లమాలినతనాన ఆమె వలి బేలగా చిత్రించబడుతుందని, ఆ వంకనే తన తెలివి తేటల్ని, భావోద్వేగాల్ని ప్రదర్శనకు దిగవిడు స్తాడని."

"చిత్తగించాలి—ఆ శ్రమ తీసుకోగల రచయితలతో సహకరించగల ఔదార్యం మనకు లేదు!"

సత్యభామ, రంగాజమ్మ, మధురవాణి, భానుమతి, కమలాదాస్—ఆ కోవలో కొలవ దగిన స్త్రీ యామిని!

"మీ కొత్త పాట మీద చిన్న అభియోగం."

పుస్తకాల అంగడిలోంచి బయటపడి, కాలి బాటను నడుస్తున్నప్పుడు పలికింది యామిని.

"అభ్యంతరం లేదు."

"పల్లవిలో క్రమం లోపించిందనుకుంటాను."

"ఏమిటో ఆ ముందు వెనకల దగా?"

"పాడవే ఒక పాట ఎవరు పాడని పాట

హృది శ్రుతిగా మది కృతిగా పాడవే-అన్నారు. మనమూ, హృదయాల్లో దేని తరవాత ఏదవుతుంది?"

"నే వ్రాసిన క్రమంలోనే."

"కాదనుకుంటాను."

ఆలకింపుగా చూశాడు సారథి.

"హృదయం అనుభూతి కేంద్రం. మనసు ఆలోచనా కేంద్రం. కృతిగా దొరకవలసింది హృదయం. దాన్ని శ్రుతిచేసి ఇవ్వవలసింది మనసు. కాదంటారా?"

సారథి మౌనం వహించాడు.

"చెప్పనే లేదు!"

"సంగీతమే కాదు, గీతాన్నికూడా లొంగ దీసుకునే టట్లున్నారు—బాబోయ్! బాబోయ్!"

అభయముద్ర పట్టి శ్రుతి కలిపింది. సారథి నవ్వుతో.

• • • •

"వచ్చిందా?"

"కష్టం చెప్పడం, ఎంత వచ్చిందీను?"

చేతి కందిన పాకెట్‌లోంచి 'ఆముక్త మాల్యద' తీసి చూస్తూ అంది యామిని.

"విష్ యు ఎ హేపీ బర్త్‌డే. . . ఆఫ్‌కోర్స్, ఎ బిట్ లేట్!"

"ప్రత్యేకించి కృతజ్ఞతలు లేవు!"

"ఆత్రతగా వచ్చినట్లున్నాను. అతిథు లెవ్వరూ కనుపించరేం?"

"ఎవరన్నారు—ఇంకెవరో ఉన్నారని?"

"ఒక్కని చేసి నన్నిచట. . . అకటా!"

"ఈ టేపు మీది పాటలు మీకు సైదోడు!"

"పలుకూ బంగారమే నన్న మాట!"

"లోపల ఒక పావు గంట వ్యవహారం!"

"అంటే, అయిదు పాట లన్న మాట!"

'పల్లవిపాడా, వేగ్గా కన్నెనోయ్...' టేప్ మీద పల్లవి మొదలైంది.

టీపాయ్ మీద బోర్లేసి ఉన్న క్రోనిన్ 'బియాండ్ ది ప్లేసెస్' అందుకున్నాడు సారథి, విన వస్తున్న పాటకు సన్నని కూనిరాగపు అనుసరింపు నిస్తూ.

తిరగవేస్తున్న పేజీల మధ్య నుంచి జారిన పాస్‌పోర్ట్‌లో వెంట్రుకలు పలచగా రేగిన మోములో స్వేచ్ఛగా విడిన యామిని పెదిమలు. అక్షరాలు



'పోరాట పుందుకోళ్ళ'

—బి. సీతారాము

మనకల్లై కదలిక మరిచాయి పుస్తకం తిరగవేస్తూన్న కళ్ళు.

ఒక్క క్షణం కళ్ళు మూసుకుని పది నిమిషాలు వెనక్కు జరిగాడు.

భుజాల వెనక విడి వదులుగా కదులుతూన్న పొడి జుత్తు. తలంటు నురుగు కాస్త ఇంకినట్లుగా కళ్ళను సన్నగా ఎర్ర జీరలు. చెమ్కా జిడ్డూ కలిసి మెరుస్తూన్న ముఖం. నలుపు చర్మాన్ని వెలిగించే కాగడాలా మామిడి చిగురు రంగు పెదిమలను తాణికే మందహాసం. అట్టహాసం లేని అలంకరణ.

యామిని అందంగా ఉంటుందా? —

ఎందుకో ఏ ఉద్యమం లేకుండా ఆమె సౌందర్యవతి అంటే అంగీకారం కుదరదు ఒక పట్టాన. అవయవాల్ని కోమలంగా వినియోగించే నేర్పూ, మెలకువా ఉన్నాయి ఎక్కడో — అదో కళ కావచ్చు!

బాలసరస్వతి, క్లిఫ్ రిచర్డ్, ముఖేష్, ఝానాలైలా, ఘంటసాల అయిపోయి, 'అద్దంపు నీ మోము మోహపు రతి సామ ...' అన్నఅన్నమాచార్య కీర్తన సాగుతూంది గుర్తు స్ఫురించని గాత్రాన.

"వింటున్నారా? చదువుతున్నారా?"

టేప్ ఆగిపోయింది.

"వింటూ చదువుతున్నాను!"

తన మాటలో చమత్కారం తనే ఎరగనట్లు అన్నాడు సారథి.

ఆ నంగనాచి వాలకానికి నవ్వు వచ్చింది యామినికి.

"మీతో ఒక విషయం చెప్పాలి."

"గది ఖాళీ అయిందంటారా?"

"అవుతుంది."

"మీ బర్త్ డే గుర్తుంటుంది చాలాకాలం!"

"ఏమో?"

"మీ జోకు!"

యామినికి నవ్వు రాలేదు.

• • •

దృశ్యాలుగా నిడుతూన్న జ్ఞాపకాల చయనికలోంచి త్రుళ్ళిపడ్డాడు సారథి.

"చెప్పనే లేదు — యామిని మీద ఏమిటి నీ అభిప్రాయం?"

ఓరగా జారవేసిన తలుపు రెక్క నెట్టుకుని వసారా గదిలోకి ఏదో మిషగా అడుగిడ బోయిన యామిని మండిగం వెలుపలే ఆగిపోయింది.

ఏడాది తరవాత తన చెల్లెలు సుమిత్ర పెళ్ళి పందిట్లో మాట సామెతగా కదలేసిన శంకరం మరొకసారి రెట్టించాడు మిత్రుడి వరాకు చూసి.

"మూడక్షరాల పేరే ఉండాలన్న నియమం లేకపోతే సరస్వతి అన్న పేరుకు తగిపోతుంది."

"నా భావం వేరే ఉందనేది నీ కర్థం కాలే దనుకోను!"

"ప్రత్యేకమైనవి, విశేషమైనవి తప్ప ఇతరత్రా భావాలు మనకేం లేవు, మరి!"

"తన శుభలేఖలో నీ పేరు వ్రాయించా లనుకుంటే?!"

"అనుచితం."

"అదేం మాట!"

"అలాటి భావనలు నాకేం అంటలేదు కనక."

"పోనీ, నేను ప్రస్తావిస్తున్నానుగా?"



## ప్రేమ కానుక

కొత్తగా పెళ్ళయిన ఒక అమ్మాయి భర్తకు తొలి ప్రేమలేఖ వ్రాసింది. ప్రేమ కానుకగా తను అల్లిన స్వెట్టర్ పంపుతూ ఇలా వ్రాసింది:

"ఇది పంపడానికి పోస్టల్ చార్జీలు చాలా అవుతున్నాయి. అందుకని, స్వెట్టర్ గుండీలన్నీ పీకేశాను . . .అక్కడ కుట్టించుకోండి.

పి. ఎస్: ఆ గుండీలు స్వెట్టర్ ఎడమ జేబులో ఉంచాను.

—ఇట్లు—మీ ప్రేయసి . . . . .

"ఆ సాహసం నే చెయ్యలేను."

"కారణం?"

సారథి మాట్లాడలేదు.

"నల్లగా ఉంటుందనా? కొంచెం పక్వేత్తనా? నీ కంటే ఎక్కువ చదువుకుందనా? మీ శాఖ కాదనా? మీ వాళ్ళాశించే కట్న కానుకలు ఇవ్వలేరనా? తల్లి లేని ఆడపిల్లనా? వాళ్ళ నాన్న బాధ్యతా రహితుడనా?"

ఆపై శంకరానికి ఇంక తోచలేదు.

నవ్వు వచ్చింది సారథికి. నిర్మొగమాటంగా నవ్వాడు.

"హాస్యం కాదు."

"వెన్నెల ఎవరి సొంతం? గాలి ఎవరి సొంతం? పడమటి ఆకాశంలో ఇంద్రధనుస్సు ఎవరి సొంతం? సూర్యకిరణం ఎవరి సొంతం? హిమాలయాలు ఎవరి సొంతం?"

"దేని కీ ఉపోద్ఘాతం?"

చిరాకుగా ధ్వనించింది శంకరం గొంతు.

"నువ్వడిగిన యామిని అనే మూడక్షరాల స్త్రీ గురించి. ఆమెతో స్నేహం గొప్పగా ఉంటుంది. ఆమెతో మాట్లాడడం, చర్చించడం, హాస్యాలాడడం, విశ్లేషించే సంగతులు వినడం—ఎంతటి మనోజ్ఞ దృశ్యాలని! ఆమె నెరుగుదునని ఎవరికైనా చెప్పుకోవడం ఎంత గర్వంగా ఉంటుందనీ!!"

"బాగుంది కాలక్షేపం!"

శంకరం గొంతులో వెటకారం పసిగట్టలేనిది కాదు.

"అంత చవక చేసి కొట్టేయకు, శంకరం. యామిని నా కొక ప్రత్యేకమైన స్త్రీ. ఆ మాటకు వస్తే చాలామంది సరసులకు ఏ ఒకరి ఆజ్ఞాపనలకిందో. శిక్షణ కిందో ఆమె బొమ్మ నా ఊహ కందదు, భార్యగా చేసుకోదగిన ఆడపిల్ల స్థానంలో ఆమెను నేను తట్టుకోలేను. జీవిత కాలమంతా నన్నే శ్రోతను, ప్రేక్షకుణ్ణి చేసే భార్యను స్వీకరించి ఓర్చుకోగల పెద్ద గుండె నాకు లేదు. కళ్ళప్పగించి చూసే ఆకర్షణ, ఆరాధన అద్భుతం కాదు. కళ్ళలో కళ్ళుఉంచే అనురాగ ప్రస్తారం కావాలి నాకుగా కావలసిన ఆడపిల్లలో!"

శంకరానికి కళ్ళు లేవు, మెదడు లేదు—చెవులు తప్ప.

"అయితే?"

"ఒక కొత్త సత్యం తెలుసుకుంది యామిని!"

చివ్వున మెడ తిప్పి చూశారు మిత్రులిద్దరూ గడపలోకి.

"నిజంగా మీకు కృతజ్ఞతలు చెప్పాలి, సారథి గారూ!"

చేతులు జోడించింది యామిని.

"వెక్కిరిస్తున్నారా?"

"ఆ అపరాధం మీ రేం చేశారని? డోంట్ బి సిల్లీ!"

తల ఎగరవేసి అదోలా నవ్వింది.

"చూశారా — ఎంత తమాయించుకుంటున్నా నా ధోరణి మారడం లేదు!"

"నువ్వంతా విన్నావా?"

శంకరాని కేమి మాట్లాడాలో తోచలేదు.

"బాధ లేదు! ఆశాభంగం లేదు! న్యూనత అసలే లేదు! జీవితంలో అందరికంటే భిన్నంగా లేని ఆశలే ఉన్న నేను అవి నెగ్గడానికి ఎలా కనిపెట్టి గుంభనగా మసలాలో తెలిసింది."

"మనస్తాపం కలిగించి ఉంటే..."

"అన్నీ తెలిసిన ఆరిందాతనపు, ఆర్భాటపు ప్రదర్శనకంటే, వికచపత్ర జల బిందువులా ఏమీ తెలియని ముక్తసరితనమే ఆడపిల్ల జీవితాన్ని కాస్తుందని... ఫరవాలేదు, చాలా లేత ల్లోనే నా బోధివృక్షం నన్ను కనిపెట్టి కరుణించింది! కాలక్షేపాలకు వీడుకోలు! అపార్థం చేసుకోకండి, సారథిగారూ... పొరబటునో, గ్రహపాటునో... థాంక్‌గాడ్!"

స్వగతంలా మాట్లాడుతూ తేలికగా నవ్వేసింది.

చాలా క్షణాలు పొలుపోని మౌనం. అంతా అర్థమయిన ఆర్ద్రత వాతావరణాన్ని కట్టివేసింది.

"ఒక్క సాయం చేస్తారా?"

కళ్ళద్దాలు తీసి చేరుమాలుతో తుడుచుకుంటూ సారథి కేసి రెప్పలు ఎత్తింది యామిని.

"గది ఖాళీ అయిందని నిన్న మీరు అందించిన కబురు మరిచిపోతాను... ఐ మీన్ నాకు గుర్తు ఉండదు."

"థాంక్స్!" శంకరం వైపు దృష్టి మళ్ళించి, "సాయంత్రం దాకా ఉండాలనుకున్నాను... రేపు కచేరీమాట నిలుపుకుంటాను...కొంచెం తెరిపికావాలి... సుమిత్రకు సారీ చెప్పు... వెళ్ళొస్తాను!"

రెప్పపడని శంకరం, సారథి దృష్టి నుంచి తేలికగా, విశ్వాసం కల మనిషిలా కుదురుగా నడిచి వెళ్ళింది యామిని. *